జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 10-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 640 పేజీలు: 4 వెల : రూ.7


# మహిళలపై దుర్భాషలాడిన.. రాధాకృష్ణను.. అరెస్టు చేయండి

✳ వైసీపీ నేతలు ✳ పలాస, టెక్కలి, నరసన్నపేట, ఇచ్ఛాపురంలో పోలీసులకు ఫిర్యాదు ✳ టెక్కలిలో అచ్చెన్న దిష్టిబొమ్మ దహనం



**పలాస/టెక్కలి/ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9 (వార్త):** ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ మహిళలపై దుర్భాషలాడారని, తక్షణం అతడిని అరెస్టు చేయాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. గురువారం పలాస, టెక్కలి, నరసన్నపేట, ఇచ్ఛాపురం తదితర నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేశారు. అమాయక మహిళలపై దుర్భాషలాడిన ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణపై కేసు నమోదు చేయాలని కోరుతూ మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ సిఐ వై.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాధాకృష్ణ సభ్యసమాజం సిగ్గుపడే విధంగా మహిళలను కించపరిచి మాట్లాడటం శోచనీయమన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించిన రాధాకృష్ణ బాధ్యతాయుతమైన వ్యక్తిగా కనీసం క్షమాపణ కూడా చెప్పకపోవడం ఆయన వైఖరి ఏమిటన్నది అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పైల వెంకటరావు, పలాస-కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపీ, వజ్రపుకొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి ఉదయకుమార్, మందస ఎంపీపీ దొక్కర దానయ్య, పలాస మాజీ ఎంపీపీ, జిల్లా పార్టీ కార్యదర్శి బత్తిని హేమేశ్వరరావు, వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పలాస మండల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి, మందస మండల పార్టీ అధ్యక్షుడు డల్లి జనాకిరెడ్డి, వజ్రపుకొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు తిర్రి రాజారావు, తదితరులు ఉన్నారు.

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం వైసీపీ నాయకులు సైతం ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో ఇన్ ఛార్జ్ ఎస్ఐ రవివర్మకి ఫిర్యాదు చేశారు. ఎండీ రాధాకృష్ణపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కంచిలి ఎంపీపీ దేవదాస్ రెడ్డి, కవిటి ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, ఇచ్ఛాపురం మాజీ మున్సిపాలిటీ ఛైర్పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మాజీ వైస్ ఛైర్పర్సన్ ఉలాల భారతి దివ్య, నర్తు ప్రేమ్ కుమార్, సుగ్గు ప్రేమ్ కుమార్, పిలక దేవరాజు, నీలయ్య, చల్ల దేవరాజు, ఆశి పురుషోత్తం, ప్రత్తి అన్వేష్, దీనబందు రెడ్డి, ధర్మారావు, పలికిల జయరాం, వల్లభరావు, అభియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**టెక్కలి:** మహిళలపై నీచమైన వ్యాఖ్యలు చేస్తూ మహిళలోకాన్ని కించపరిచిన ఏబీఎన్ అధినేత వేమూరి రాధాకృష్ణపై చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్ చార్జీ పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. టెక్కలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గురువారం టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు టెక్కలి పార్టీ కార్యాలయం నుంచి ద్విచక్ర వాహనాలతో పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏబీఎన్ రాధాకృష్ణ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈయనతో పాటు టెక్కలి, కోటబొమ్మాళి జడ్పీటీసీలు దువ్వాడ వాణి, దుబ్బ వెంకటరావు, ఎంపీపీలు ఆట్ల సరోజనమ్మ, రోణంకి ఉమా మల్లేశ్వర రావు, నాయకులు అన్నెపు రామారావు, సత్తారు సత్యం, పార్టీ మండల అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వర రావు, యర్రా చక్రవర్తి, కె. నారాయణ మూర్తి, పేడాడ వెంకట రావు, ఎం గణపతి రావు, కె. సంజీవ రావు, పి. రమేష్, ఎం. నాగ భూషణ్ తో పాటు నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## అచ్చెన్న దిష్టిబొమ్మ దగ్ధం

వైసీపీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడి పై మంత్రి అచ్చెన్నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు జుగుప్సాకరమైన మాటలు మాట్లాడినందుకు నిరసనగా గురువారం సాయంత్రం వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలి వైయస్సార్ జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అచ్చెన్నాయుడు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అచ్చెన్నాయుడు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

**నరసన్నపేట:** ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహనరెడ్డిపై, పార్టీ ముఖ్య నాయకుల భార్యలపైన నికృష్టమైన భాషలతో దూషించిన వైనంపై క్షమాపణ చెప్పకపోగా దిగజారి ప్రవర్తిస్తున్న తీరుపై నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో రాధాకృష్ణపై ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలను దగ్ధం చేస్తూ ఎండి రాధాకృష్ణకు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురలీధర్, జలుమూరు ఎంపీపీ వాన గోపి, పోలాకి ఎంపీపీ బైరవ నాయుడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ శాఖలకు చెందిన నాయకులు కరీం, రాజేశ్వరరావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.





# నగర సుందరీకరణే లక్ష్యం

✳ ఆగస్టు నాటికి స్టేడియం సిద్ధం
✳ నాగావళి నది ఒడ్డున వాకింగ్ ట్రాక్, రోడ్డు
✳ రిజర్వు స్థలాల్లో పార్కులు
✳ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
✳ ఎమ్మెల్యే, అధికారులతో కలిసి కేఆర్ స్టేడియం పరిశీలన

**శ్రీకాకుళం, ఏప్రిల్ 9 (వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించిన 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' లక్ష్య సాధనలో భాగంగా శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నగరంలోని పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత గూనపాలెం పార్కును సందర్శించిన అనంతరం, కోడిరామ్మూర్తి స్టేడియం పనులను సమీక్షించారు. స్టేడియంకు సంబంధించిన సివిల్ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని, ఆ వెంటనే శాప్ ద్వారా రూ. 2.6 కోట్లతో అత్యాధునిక క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు వెల్లడించారు. నగరంలో అభివృద్ధి చేస్తున్న పార్కులకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ముఖ్యంగా కార్గిల్ పార్కులో చిన్నారులు, వృద్ధుల కోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్లను నగర ప్రజలు ఎంతో స్వాగతిస్తున్నారని చెప్పారు. అలాగే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్ఆర్ నిధుల కింద ఒక్కో పార్కుకు రూ. 50 లక్షల చొప్పున నాలుగు పార్కులకి నిధులు కేటాయించినట్లు తెలిపారు. హడ్కో కాలనీ, ఆర్కే నగర్, ఏపీజే అబ్దుల్ కలాం పార్కులను పరిశీలించిన మంత్రి.. నగర ప్రమాణాలను పెంచేలా వీటిని తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా నాగావళి నది ఒడ్డున కిలోమీటరు మేర వాకింగ్ ట్రాక్, రోడ్డు నిర్మిస్తామని.. అలాగే నగరం నుంచి బీచ్ వరకు 9 కిలోమీటర్ల మేర 'గ్రీన్ ఫీల్డ్ రోడ్డు'ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రిజర్వు స్థలాలను కాపాడాలని, పచ్చదనం, ఆహ్లాదం కోసం పార్కులను ఏర్పాటు చేసే పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ కమిషనర్ కూర్మారావు, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ, సుడా ఇంజనీర్ సుగుణాకర రావు, పలువురు అధికారులు, పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# కార్మికుల భద్రతకు.. అధిక ప్రాధాన్యత

✳ దేశ అభివృద్ధికి పరిశ్రమలు అవసరం
✳ ప్రతీ కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్థి
✳ రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా, మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి ✳ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం ✳ ఎన్ఎసిఎల్‌లో ముగిసిన 55వ జాతీయ భద్రత వారోత్సవాలు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 9 (వార్త):** కార్మికుల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, దేశాభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరమని రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా శాఖ మంత్రి వాసంసెట్టి శుభాష్ వెల్లడించారు. నాగార్జున అగ్రికం కెమికల్ లిమిటెడ్ (ఎన్ఎసిఎల్)లో 55వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి మంత్రితో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గం శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలసి గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎసిఎల్‌లో ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో నిర్వహిస్తున్న 55వ జాతీయ భద్రతా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సంస్థలోని యాజమాన్యం, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల చూపుతున్న నిబద్ధతకు అభినందనలు తెలిపారు. జాతీయ భద్రతా దినోత్సవం ఒక సాధారణ వేడుక మాత్రమే కాదని, ఇది మనందరికీ భద్రతపై అవగాహన పెంచే ఒక జాతీయ ఉద్యమన్నారు. దేశ అభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరమన్నారు. ప్రతి కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్తని, వారి భద్రతను కాపాడటం కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదు, ఒక నైతిక బాధ్యత కూడా ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగి భద్రతలో భాగస్వామ్యం చేయాలని, వారికి అవగాహన కల్పించాలని, నియమాలను కచ్చితంగా పాటించాలని వివరించారు. ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ కంపెనీలో ఉద్యోగం చేసే వారు సేఫ్‌గా తిరిగి ఇంటికి రావాలని కోరుకుంటారని, వారిని బాగా చూసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగక ముందే కాపాడుకోవాలని చెప్పారు. నిబంధనల ప్రకారం భద్రత ఏర్పాట్లు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. నియోజక వర్గంలో ఉన్న ఈ పని చేస్తున్న పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. భద్రతతో పాటు జాబ్ సెక్యూరిటీ కల్పించాలన్నారు. కంపెనీ యాజమాన్యంతో సమావేశమై మంత్రి సమక్షంలోనే ఈ ప్రాంతంలో ఉన్న యువతకు ఉపాధి కల్పించడం లేదని స్థానిక శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు మంత్రి దృష్టికి తీసుకురాగా స్థానిక యువతకు ఇక్కడే అప్రెంటిస్‌ప్ ఇచ్చి ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. తాగునీరు, తదితర సమస్యల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. సాయి ప్రత్యూష, ఎన్ఎసిఎల్ ప్లాంట్ యూనిట్ హెడ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

## శ్రీకాకుళం

# మావిగన్‌పై చంద్రబాబు ప్రజాభిప్రాయానికి సిద్ధపడాలి

◆మూడు నగరాలు అభివృద్ధి చెందడం చంద్రబాబుకు ఇష్టం లేదా?

◆అమరావతి రాజధాని నిర్మాణం పేరిట దోపిడే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలు

◆వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు



పలాస, ఏప్రిల్ 9 (వార్త): రాష్ట్ర రాజధాని విషయంలో వైయస్సార్సీపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన మావిగాన్ ప్రతిపాదనకు ప్రజలు అంగీకరిస్తుంటే, కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతి పేరిట దోపిడీకి ప్రతిపాదన చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే మావిగన్ పై ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధపడాలని, అప్పుడే ప్రజల అభిప్రాయం కూటమి ప్రభుత్వానికి అర్థం అవుతుందని వైయస్ఆర్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు సవాల్ విసిరారు. గురువారం పలాసలో ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం, విజయవాడ, గుంటూరును (మావిగాన్) కలుపుతూ 110 కిలోమీటర్ల కారిడార్ రాజధాని నిర్మాణానికి అత్యంత ఆచరణాత్మక ప్రతిపాదనని బమ్మిడి దుర్యోధనరావు స్పష్టం చేశారు. అమరావతి తో పోలిస్తే కేవలం 10 శాతం వ్యయంతోనే రాజధాని కల సాకారం అవుతుందని ఆయన పేర్కొన్నారు. అతి తక్కువ ఖర్చుతో రాజధాని వేగంగా అభివృద్ధికి చెందినందుకు మాజీ సీఎం జగన్ చేసిన ప్రతిపాదన చాలా ముఖ్యమైనదని, రాష్ట్ర ప్రజల, మేధావుల అభిప్రాయం తెలుసుకోకుండానే కూటమి ప్రభుత్వం మావిగన్ పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీలోని ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ సీఎం చేస్తారని, అలాగే మావి గన్ పై కూడా ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తే వాస్తవ విషయాలు తెలుస్తాయని అన్నారు. చంద్రబాబు అండ్ కో రాజధాని పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని, లక్షల కోట్లు రూపాయలు అప్పులు తెచ్చి అంచనా విలువలు భారీగా పెంచేసి ప్రజా ధనాన్ని దోచేస్తున్నారన్నారు. హైదరాబాద్, ఢిల్లీ వంటి మహానగరాల్లో సకలహంగులతో ఇటాలియన్ మార్బుల్స్ తో చదరపు అడుగు కేవలం రూ. 4,500 అడుగు లకు నిర్మిస్తుంటే అమరావతిలో చదరపు అడుగుకు రూ.11 వేల నుంచి రూ.14 వేలు వరకు చెల్లించడంలో ఆంతర్యం ఏమిటని బమ్మిడి దుర్యోధనరావు ప్రశ్నించారు. మావిగన్ ప్రాంతంలో ఇప్పటికే సిపోర్టు, ఎయిర్ పోర్టు,రైల్వే, హైవే లతో విస్తరించి ఉన్నాయని,అమరావతి కోసం చంద్రబాబు చెబుతున్న మొత్తంలో కేవలం 10 శాతం పెట్టుబడి పెడితే హైదరాబాద్, చెన్నై మహా నగరాలను తల దన్నే రీతులు మావిగన్ అభివృద్ధి చెందుతుందన్నారు. అమరావతిలో రోడ్లు, డ్రైన్లు,తాగునీరు, మౌలిక వసతులు కల్పన కోసం రూ. 2 లక్షల కోట్లకు ఖర్చు అవుతుంది అన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని స్థితిలో అంత భారీ మొత్తం ఎక్కడి నుంచి తెస్తారు అన్నారు. 2028 నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేయగలిగినప్పుడు చట్టబద్ధత కల్పించడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం కూటమి ప్రభుత్వానికిపట్టుకుందన్నారు. లక్ష ఎకరాల్లో అమరావతి నిర్మాణం సమీప భవిష్యత్తులో సాధ్యం కాదని తెలిసినా చట్టబద్ధత పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు. ఇటీవల ఏబీఎన్ రాధాకృష్ణ మాజీ సీఎం జగన్ చెబితే వైయస్సార్సీపి నాయకులు కట్టుకున్న భార్యలను వదిలి చెల్లిగా భావిస్తారని,పెళ్లి సంబంధాలు కూడా చూస్తారని, తమ పార్టీ నేతలను వెన్నెముకలేని బ్యాచ్ గా విమర్శలు చేయడం, మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బూతులు మాట్లాడితే ఏబీఎన్ రాధాకృష్ణకు మహిళలే తగిన విధంగా గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని నీచ భాషలో తిట్టి.. నేడు 2024లో పొత్తు పెట్టుకుని టిడిపి పోటీ చేసిందన్నారు.నేడు రాష్ట్రానికి కేంద్రం ఏమిచ్చిందని ఆయన ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్ పై ఎంత విషం చిమ్మి, తప్పుడు విమర్శలు చేసినా ప్రజల్లో ఉన్న ఆదరణ తగ్గదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఘనవిజయం వైఎస్ఆర్సిపి సాధించి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని బమ్మిడి దుర్యోధనరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నాణ్యతే ప్రధానంగా రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం



పలాస, ఏప్రిల్ 9 (వార్త): రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి ఒక వార్తాపత్రికలో వచ్చిన కథనాన్ని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు ఖండించారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని సోషల్ మీడియాలో, కొన్ని వార్తా పత్రికల్లో వస్తున్న వార్తలు వాస్తవం కాదని ఆయన ఖండించారు.

పిల్లర్ల తొలగింపునకు కారణం: అక్కడ రెండు పిల్లర్ల మధ్య ఎత్తులో తేడా రావడంతో, సుమారు 80 సెంటీమీటర్ల ఎత్తు పెంచేందుకు రైల్వే, ఆర్ అండ్ బి అధికారుల సూచన మేరకు వాటిని రీవర్క్ చేయడం జరిగిందని బాబూరావు వివరించారు.

నిర్మాణ నాణ్యత: ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడలేదని స్పష్టం చేశారు. స్థానిక ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల అభిప్రాయం తీసుకున్న తర్వాతే పనులు జరుగుతున్నాయని తెలిపారు.

నిధుల కేటాయింపు: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, రామ్మోహన్నాయుడులు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి సుమారు 43 -44 కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చారని, ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 314 దరఖాస్తులు



జలుమూరు, ఏప్రిల్ 9 (వార్త): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ ఏడాది 100 సీట్లకు మొత్తం 314 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 12న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడనుంది. విద్యార్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ (https://apms.apcfss.in](https://apms.apcfss.in) ద్వారా కాండిడేట్ ఐడి మరియు పుట్టిన తేదీ నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష రోజున ఉదయం 8:30 గంటలకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు. సందేహాల నివృత్తి కోసం 9440322964 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. పరీక్షను సజావుగా మరియు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని పాఠశాల అధికారులు పేర్కొన్నారు.

## వైసీపీ నేత మృతికి సంతాపం



కంచిలి ఏప్రిల్ 9(వార్త ): కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మద్దుషణ్ముఖరావు (35) ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందారు. ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, కంచిలి మండలం వైసీపీ నేతలు లడ్డు కేశవ పాత్రో తలగాన తిరుపతి కొనపల సురేష్ కుమార్ మద్దు వెంకటరావు బొట్టా ఉమాపతి తదితరులు మృతుని కుటుంబాన్ని గురువారం కలసి పరామర్శించారు. షణ్ముఖరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ధైర్యాన్ని చెప్పారు ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు.

## మత్స్యకారుడికి ఆర్థిక సాయం



ఇచ్ఛాపురం ఏప్రిల్ 9 (వార్త): ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు రాజు బెహర కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బరంపురం మెడికల్ కాలేజీ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న హంగీర్ బెహర, మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి 5000 రూపాయల నగదు ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాక, బాధితుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పి పరామర్శించారు. ఈ సేవా కార్యక్రమంలో యువకులు త్రిలోచనం, గణేష్, యాంగిచ తదితరులు పాల్గొన్నారు.

## బి సి బాయ్స్ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం ఏప్రిల్ 9 (వార్త): ఇచ్ఛాపురం బీసీ బాలుర వసతి గృహంలో (హాస్టల్) గత కొద్ది రోజులుగా బోరు పాడవడంతో విద్యార్థులు తీవ్రంగా నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే సమాచారం అందడంతో, జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళ్ల జైదేవ్ వెంటనే తన బృందంతో అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ వార్డెన్‌తో నేరుగా కలిసి మాట్లాడి, బోరు ఇప్పటివరకు మరమ్మతు చేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.రేపటిలోగా బోరును పూర్తిగా మరమ్మతు చేసి, విద్యార్థులకు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని వార్డెన్‌కు స్పష్టంగా సూచించి, మాట తీసుకున్నారు. అలాగే హాస్టల్ పరిశుభ్రత విద్యార్థులకు అందుతున్న ఆహారం విషయాలపై కూడా ప్రత్యేకంగా చర్చించి, పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా, పిల్లలకు తాగునీటి క్యాను అవసరం ఉందని తెలియజేయడంతో వెంటనే క్యాన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళ్ల జైదేవ్ తో పాటు ప్రతినిధులు సాలిన జగదీశ్, కాళ్ల మోహన్ రావు, కాళ్ల శివ, బదకల సంతోష్ పాల్గొన్నారు.



## జ్ఞాన భారతిలో సౌర్య దివాస్




ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9 (వార్త):జ్ఞాన భారతి పాఠశాలలో సౌర్య దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1965, ఏప్రిల్ 9న జరిగిన సర్దార్ పోస్ట్ యుద్ధంలో సిఆర్పిఎఫ్ చూపిన అసాధారణ ధైర్య సాహసాలను చూపి పాకిస్తాన్ సైన్యాన్ని ఓడించిన సందర్భాన్ని సౌర్య దివస్ గా పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఈరోజు పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహన అధికారి జోహార్ ఖాన్ విద్యార్థులను ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. గుజరాత్ లోని రన్ ఆఫ్ కచ్ ప్రాంతంలో సర్దార్ పోస్ట్ ను సుమారు 150 మంది సిఆర్పిఎఫ్ సిబ్బంది కాపులాకాస్తుండగా, సుమారు 3500 మంది పాకిస్తాన్ సైనికులు దాడి చేశారు. ఈ దాడిని సిఆర్పిఎఫ్ జవాన్లు విజయవంతంగా తిప్పికొట్టి, ధైర్య సాహసాలను ప్రదర్శించారని అన్నారు. 34 మంది పాకిస్తాన్ సైనికులను సి ఆర్ పి ఎఫ్ జవాన్లు హతమార్చారని, ఆరుగురు సిబ్బంది వీరమరణం పొందారని తెలిపారు. సిఆర్పిఎఫ్ జవాన్లు... కర్తవ్యానికి, త్యాగానికి దేశభక్తికి నిజమైన ఉదాహరణగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ దళాల ధైర్యం, అంకితభావాన్ని స్మరించుకోవాలని, వారి నుంచి దేశభక్తి స్ఫూర్తిని పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ బి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్,అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో ఉద్దానం ఖ్యాతి చాటాలి

### గోల్ఫ్ షాట్ బాల్ పోటీల్లో దేవేంద్ర మెరవాలి

సోంపేట ఏప్రిల్ 9(వార్త ): ఉద్దానం ప్రాంతంలో కవిటి మండలంలో మారుమూల గ్రామమైన తొత్తిడి పుట్టుగ నుంచి గోల్ఫ్ షాట్ బాల్ పోటీలలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన జన్ని దేవేంద్ర త్వరలో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ క్రీడా పోటీలలో విజయం సాధించి ఉద్దానం ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో వికసింపజేయాలని కంచిలికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ నర్తు కృష్ణంరాజు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి గోల్ఫ్ షాట్ బాల్ క్రీడలో ప్రావీణ్యత సంపాదించుకున్న దేవేంద్ర త్వరలో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ గోల్ఫ్ షాట్ బాల్ పోటీలకు ఎంపిక అవడం ఎంతో గర్వకారణమని డాక్టర్ కృష్ణంరాజు అన్నారు. ఆయన తనవంతుగా దేవేంద్రకు శ్రీలంక వెళ్లేందుకు తాను నిర్వహిస్తున్న ట్రూ హాండ్స్ ఫౌండేషన్ ద్వారా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒంటరిగా బతుకుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన దేవేంద్ర అంతర్జాతీయ పోటీల్లో విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.




# ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా జనగణన పూర్తి చేయాలి






పలాస, ఏప్రిల్ 9 (వార్త): ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా జనగణన పూర్తి చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు కోరారు. ఆంధ్రప్రదేశ్ లో మే 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జనగణనకు సంబంధించి పురపాలక సంఘం పరిధిలో గురువారం మున్సిపల్ కార్యాలయంలో సూపర్వైజర్లకు ఎన్యూమరేటర్లకు జనగణనకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇంటిని కూడా తప్పనిసరిగా ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా జనగణన చేయవలసిందిగా సిబ్బందికి సూచించారు. జనగణనలో లక్ష్యం వేగం కంటే ఖచ్చితత్వం. సరైన శిక్షణ, జాగ్రత్తగా ప్రశ్నించడం, నిజమైన నమోదు, తనిఖీ ప్రక్రియలతో పని చేస్తే పొరపాట్లు చాలా వరకు తగ్గుతాయని చెప్పారు. ఒక కుటుంబంలో సభ్యుల సంఖ్య లేదా వయస్సులో సందేహం ఉంటే, "ఖచ్చితంగా చెప్పగలరా?" అని మళ్లీ అడిగి, తరువాతే నమోదు చేయాలని, ఇలా చేస్తే కవరేజ్ తప్పులు, కంటెంట్ తప్పులు రెండూ తగ్గుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు శ్రీ బి కిషోర్ కుమార్, కే. షణ్ముఖరావు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జనగణన బాధ్యతాయుతంగా చేయాలి

ఇచ్ఛాపురం ఏప్రిల్ 9 (వార్త): జనగణన బాధ్యతాయుతంగా నిర్వహించాలని తహశీల్దార్ వెంకట రావు కోరారు. స్థానిక గర్ల్స్ హై స్కూలు లో తహసీల్దార్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ ట్రైనింగ్ నకు 44 మంది ఎన్యుమరేటర్ లు,సూపర్ వైజర్ లు పాల్గొన్నారు. జిల్లా పరిధి లో శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనీ లు బండారు శంకరం, యం. శంకరరావు లు ఈ 44 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ బ్యాచ్ -1 ట్రైనింగ్ 9 నుండి,11 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


### జనాభా లెక్కలు పక్కాగా నిర్వహించాలి

సారవకోట, ఏప్రిల్ 9 (వార్త): జనాభా లెక్కలను ఖచ్చితంగా, పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. గురువారం సారవకోట మండల పరిషత్ మీటింగ్ హాల్లో జనాభా గణనకు నియమించిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి 31 వరకు మొదటి విడతగా గృహాల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. జనాభా లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లకు మూడు విడతల్లో, ప్రతి విడతలో మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జనాభా గణనలో తప్పులు లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు.



### ఎన్రోల్మెంట్ పెంపుపై దృష్టి పెట్టాలి

నరసన్నపేట, ఏప్రిల్ 9 (వార్త): బుచ్చిపేట మోడల్ ప్రైమరీ పాఠశాలను గురువారం ఉదయం ఎంఈవో పేడాడ దాలినాయుడు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న వార్షిక పరీక్షల విధానాన్ని ఆయన పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులకు సూచించారు. రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) పెరిగేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అలాగే మధ్యాహ్న భోజనం రుచికరంగా, నాణ్యతతో వండాలని, ప్రతిరోజూ తల్లిదండ్రులు భోజనం రుచి చూసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.



### జనగణనకు డిజిటల్ శిక్షణ..



నరసన్నపేట, ఏప్రిల్ 9 (వార్త): జనగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తహశీల్దార్ డి. సత్యనారాయణ తెలిపారు. గురువారం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. 2027 జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో అవసరమైన అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. డేటా సేకరణ, నమోదు విధానాలపై అధికారులు సమగ్రంగా వివరాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జీవీ రవికుమార్, అన్నాజీ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

## శ్రీకాకుళం

# జనగణన సర్వే విధులు సమర్థవంతంగా నిర్వహించాలి



◆జనగణనలో పొరపాట్లు చేయకండి... తహాశీల్దార్, ఎంపీడీఓ
◆మే 11 నుంచి జూన్ 9 వరకు తొలి విడత జనగణన ప్రారంభం
◆ ఇంటి వివరాలు, సౌకర్యాలపై పూర్తి సమాచారం సేకరణ
◆మొబైల్ యాప్ ద్వారా ఎన్యుమరేటర్ల పని
◆ పూర్తిగా డిజిటల్ పద్ధతిలోనే..
◆ సరైన సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత

జి.సిగడాం, ఏప్రిల్ 09,(వార్త): జనాభా లెక్కల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, తహాశీల్దార్ ఎం.సరిత ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో పంచాయితీ కార్యదర్శులు,విర్వోలు, సచివాలయ అన్ని శాఖల వారితో జనగణన తొలిదశలో నిర్వహించనున్న గృహల జాబితా జనగణన కార్యక్రమానికి సంబంధించిన ఫీల్డ్ ట్రైనర్స్ అధికారులకు శిక్షణ కార్యక్రమం తరగతులు నిర్వహించారు.శిక్షణలో బోధించిన ప్రతి అంశాన్ని స్పష్టంగా అర్థం చేసుకుని అమలు చేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు.ఎన్నికల నిర్వహణకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో అదే స్థాయిలో జనగణన ప్రక్రి యకు కూడా ప్రాముఖ్యత ఉందన్నారు.హౌసింగ్ మ్యాపింగ్ ప్రక్రియ ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటిని ఖచ్చితంగా గుర్తించి ఎటువంటి పొరపాట్లు లేకుండా మ్యాపింగ్ చేయాలని ఆదే శించారు. హ్యాండ్స్-అండ్ ట్రైనింగ్ ద్వారా పొందిన అనుభవాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఫీల్డ్ ట్రైనర్స్ గా ఉన్న ఉపాధ్యాయులు తమ కింద పని చేసే ఇన్యుమరేటర్లకు సమగ్ర శిక్ష అందించి కింది స్థాయిలో ఖచ్చితంగా పర్యవేక్షణ చేయా లని ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందకు జనాభా లెక్కలు ప్రతి పాదికగా ఉపయోగపడతాయన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డిజిటల్ పద్ధతిలో జనాభా గణనను సక్రమంగా నిర్వహించాలన్నారు.జనగణన ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల కల్పనకు, సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడానికి కచ్చిత మైన గణాంకాలు అవసరమని తెలిపారు. వయస్సు, విద్యార్హత, వృత్తి, సామాజిక వర్గం, మౌలిక వతసుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు.33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాలని తెలిపారు. మొదటి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల భవనాలు, కుటుంబ వివరాలను, రెండో దశలో వ్యక్తిగత వివరాల సేకరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ఎన్. నిర్మల, సచివాలయ పర్యవేక్షణ ప్రత్యేక అదికారి మురళీ, ఉపాద్యాయులు, తదితరులు పాల్గొన్నారు

## జనాభా లెక్కల సేకరణ చాలా క్రియాశీలకం

### తహసిల్దార్ అప్పలస్వామి



సోంపేట ఏప్రిల్ 9 (వార్త ): ఈ ఏడాది మే నెల నుంచి కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జనాభా లెక్కల సేకరణ చాలా క్రియాశీలకమైన కార్యక్రమమని సోంపేట తహసీల్దార్ బి అప్పలస్వామి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఎన్యుమరేటర్ల శిక్షణా తరగతులను తహసిల్దార్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ప్రతి 10 ఏళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం ద్వారా దేశ అభివృద్ధికి సంబంధించి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఎంతో కీలకమైన అంశమని అన్నారు. దేశ ప్రగతిలో సామాజిక అభివృద్ధిలో దిగువ స్థాయిలో ఉన్న సామాజిక వర్గాలకు కల్పించే రిజర్వేషన్ల అంశంలో జనాభా లెక్కల సేకరణ ద్వారా వచ్చే వాస్తవ అంశాలు చాలా కీలకమైనవని పేర్కొన్నారు. ఇటువంటి వివరాల సేకరణ కోసం నియమించిన సిబ్బంది ఎంతో అంకితభావంతో పారదర్శకంగా సేకరణ నిర్వహించాలని కోరారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి అలసత్వానికి అవకాశం లేకుండా చిత్తశుద్ధితో విధులు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం ఎన్యుమరేటర్లు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ తహసిల్దారు ఉమామహేశ్వరరావు , ఆర్ఐ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై అవగాహన..

### విద్యార్థులకు స్వీయ రక్షణపై సూచనలు

పోలాకి, ఏప్రిల్ 9 (వార్త): పోలాకి మండలం అంపలాంలోని ప్రభుత్వ జెడ్‌పి హైస్కూల్లో గురువారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డివిజన్ శక్తి టీంకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బాల బాలికలు స్వీయ రక్షణపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని వివరించారు. శక్తి యాప్ ఉపయోగం ద్వారా భద్రతను పెంచుకోవచ్చని తెలిపారు. అలాగే జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## నీటిని సంరక్షించాలి..

### భవిష్యత్తుకు ఇది అవసరం - ఎంపీడీవో మోహన్ కుమార్

సారవకోట, ఏప్రిల్ 9 (వార్త): ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించుకోవాలని ఎంపీడీవో మోహన్ కుమార్ సూచించారు. గురువారం సారవకోట మండల కార్యాలయంలో నీటి సంఘాల ఛైర్మన్లు, డైరెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులతో జల సంరక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నుంచే నీటి వనరులను కాపాడుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ, వనరులను సంరక్షించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# స్థానిక సమరానికి టీడీపీ సై!

◆క్షేత్రస్థాయి వ్యూహాలు, అభివృద్ధి మంత్రంతో పూర్తిస్థాయి వార్డులే లక్ష్యంగా ముందుకు సాగాలి



పలాస, ఏప్రిల్ 9 (వార్త): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సంపూర్ణ విజయాన్ని కైవసం చేసుకునేందుకు తెలుగుదేశం పార్టీ పక్కా వ్యూహరచనతో సిద్ధమవుతోంది. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నుండి పార్టీని పటిష్టం చేయడం, మరోవైపు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో సాధించిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం అనే ద్వంద్వ వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఉన్నత నాయకత్వం దిశానిర్దేశం చేసింది.

### క్షేత్రస్థాయిలో పటిష్ఠ కార్యాచరణ

గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో క్లస్టర్-1 కన్వీనర్ సవర రాంబాబు మాట్లాడుతూ గెలుపే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త వెంకన్న చౌదరిల మార్గదర్శకత్వంలో ప్రతి వార్డులోనూ పక్కా ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి యూనిట్, బూత్ కన్వీనర్లు తమ పరిధిలోని ఓటర్లతో మమేకమవ్వాలని, ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వ విజయాలను వారికి వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు మాట్లాడుతూ, "ప్రతి వార్డులోనూ పార్టీ జెండా ఎగరేయడమే మన లక్ష్యం. అధిష్టానం ఆదేశాలను శిరసావహించి, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలి" అని కార్యకర్తలలో ఉత్సాహం నింపారు. పట్టణ కార్యదర్శి సప్ప నవీన్ మాట్లాడుతూ, "నాయకత్వం నిర్దేశించిన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడానికి అవసరమైన సమన్వయం చేసి, పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషిస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలను ప్రతి గడపకూ చేరవేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. స్థానిక నాయకత్వం యొక్క కృషికి రాష్ట్ర స్థాయి నుండి సంపూర్ణ సహకారం అందించి, రానున్న ఎన్నికలలో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు.

### 'అభివృద్ధి-ఐక్యత' ప్రధాన ప్రచారాస్త్రాలు

కేవలం సంస్థాగత నిర్మాణంపైనే కాకుండా, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ప్రచార అస్త్రాలపై కూడా పార్టీ స్పష్టమైన వైఖరితో ఉంది. రాష్ట్ర టిడిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీ లొడగల కామేశ్వరరావు మాట్లాడుతూ, "ఈసారి అన్ని వార్డులలోనూ గెలుపొందడమే మన లక్ష్యమని, మన ఐక్యత, అభివృద్ధి ముందు ప్రత్యర్థులు నిలవలేరని, నూటికి, నూరు శాతం గెలిచినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అని పేర్కొన్నారు.

### ప్రచారంలో కీలక అంశాలు

ఎమ్మెల్యే నాయకత్వంలో అభివృద్ధి: "గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి గౌతు శిరీష నాయకత్వంలో జరిగింది" అనే వాస్తవాన్ని ప్రజలకు వివరించాలి. విశాఖ డివిజన్ విలీనమని, దశాబ్దాల నాటి కలను సాకారం చేస్తూ, స్థానిక ప్రాంతాన్ని విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం చారిత్రాత్మక విజయమని, దీని ఘనత ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడులకే దక్కుతుందని ప్రచారం చేయాలని కోరారు. ఐక్యతే మహాబలమని, ప్రత్యర్థులను తక్కువ అంచనా వేయకుండా, పూర్తి ఐక్యమత్యంతో ఎన్నికలను ఎదుర్కోవాలని నాయకులకు హెచ్చరించారు.

### వ్యూహాత్మక హెచ్చరిక

ప్రత్యర్థులను తక్కువ అంచనా వేయొద్దని, "చిన్న పాము అయినా సరే, పెద్ద కర్రతో కొట్టాలి" అన్నట్లుగా పూర్తి శక్తితో ఎన్నికలకు సిద్ధం కావాలని నాయకులకు హెచ్చరించారు. ఈ ద్వంద్వ వ్యూహంతో---ఒకవైపు పటిష్టమైన క్షేత్రస్థాయి నిర్మాణం, మరోవైపు బలమైన అభివృద్ధి ప్రచారంతో స్థానిక సంస్థల ఎన్నికలలో సంపూర్ణ విజయం సాధిస్తామని పార్టీ శ్రేణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గాలి కృష్ణారావు, మల్లిపెద్ది చిన్ని, ఇతర ముఖ్య నాయకులు, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిన నాడు-నేడు పనులు

### నిధులు ఉన్నా పురోగతి లేకపోవడంపై ఆందోళన



జలుమూరు, ఏప్రిల్ 9 (వార్త): నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ నాడు-నేడు పథకంలో చేపట్టిన పనులు కొన్ని మండలాల్లో నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జలుమూరు మండలం పాగోడు జెడ్పీ పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభించి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పూర్తికాకపోవడం గమనార్హం. పాఠశాల హెడ్‌మాస్టర్ కోటి బాబు మాట్లాడుతూ, రూ.10 లక్షల నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. దీంతో విద్యార్థులు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పాఠశాల అభివృద్ధి ఆగిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులను వేగవంతం చేసి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

## కిసాన్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవానికి ఆహ్వానం

జలుమూరు, ఏప్రిల్ 9 (వార్త): కిసాన్ కాంగ్రెస్ 96వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 11వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం పట్టణంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదన్ రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రివర్యులు డాక్టర్ కిల్లి కృపారాణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు, శాసనసభ అభ్యర్థులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, డిసిసి కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మత్స్యకార, సేవాదళ్, ఐఎన్‌టీయూసీ, ఎన్ఎస్‌యూఐ తదితర విభాగాల అధ్యక్షులు, సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత మామిడి సత్యనారాయణ ఈ మేరకు పిలుపునిచ్చారు.

## నీటి భద్రత పనులు వేగవంతం చేయాలి

### ఎంపీడీవో కేవీ ప్రసాదరావు




నరసన్నపేట, ఏప్రిల్ 9 (వార్త): ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన "నీటి భద్రత -- సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో భాగంగా పనులను త్వరితగతిన గుర్తించి అమలు చేయాలని ఎంపీడీవో కేవీ ప్రసాదరావు సూచించారు. బుధవారం సాయంత్రం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళికలో భాగంగా మండలంలోని సుమారు 50 చెరువుల్లో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పనులను సమయపాలనతో పూర్తి చేసి నీటి వనరులను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వంశధార, ఉపాధి హామీ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌ఏ-2 పరీక్షల పర్యవేక్షణ..

### విద్యార్థులకు మార్గదర్శకాలు



జలుమూరు, ఏప్రిల్ 9 (వార్త): జలుమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్మెంట్ - 2 (ఎస్‌ఏ-2) పరీక్షలను ఎంఈఓ బమ్మిడి మాధవరావు గురువారం పర్యవేక్షించారు. మండలంలోని అల్లాడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను సందర్శించిన ఆయన, పరీక్ష పేపర్‌ను పరిశీలించి పరీక్షల నిర్వహణ విధానాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నాపత్రం ఆధారంగా విద్యార్థులు సమాధానాలు ఎలా రాయాలో ఉపాధ్యాయులు ముందుగానే వారికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు వైద్య పరీక్షలు..



సారవకోట, ఏప్రిల్ 9 (వార్త): గర్భిణీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని బొంతు పీహెచ్సీ వైద్యురాలు సుస్మిత సూచించారు. గురువారం మాతృ సురక్ష కార్యక్రమంలో భాగంగా పీహెచ్సీ పరిధిలో గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 27 మంది గర్భిణీలకు పరీక్షలు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గర్భం దాల్చిన నాటి నుంచే సరైన పోషకాహారం తీసుకోవడం అత్యంత అవసరమని వివరించారు. తల్లి, శిశువు ఆరోగ్యానికి ఇది కీలకమని పేర్కొన్నారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్య సూచనలు పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 13 నుంచి విలేకరులకు జెమ్స్‌లో రోగ్య పరీక్షలు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 9 (వార్త):** విలేఖరులకు ఈనెల 13 నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కమ్మినాన చెన్నకేశవరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు జెమ్స్ ఆసుపత్రిలో నిర్వహిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి జెమ్స్ ఆసుపత్రిలో బ్యాచ్‌ల వారీగా ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో (గుండె సంబంధిత), కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సిబిపి) వంటి కీలక పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి జనరల్ ఫిజిషియన్, కార్డియాలజిస్ట్, న్యూరో, ఆర్థో, గ్యాస్ట్రో నిపుణుల ద్వారా తనిఖీలు చేయనున్నట్లు వివరించారు. వైద్య పరీక్షలకు హాజరుకావాలనుకునే జర్నలిస్టులు తమ పేరు, పనిచేస్తున్న మీడియా ఆర్గనైజేషన్, అక్రిడిటేషన్ నంబరుతో పాటు, కుటుంబ సభ్యుల వివరాలు, అందరి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సమాచార శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ముందుగా ఈ నెల 10వ తేదీ లోపు 8985539662, 9493399367 ఫోన్ నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారు, వారికి కేటాయించిన తేదీల్లో మాత్రమే ఆసుపత్రికి హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. మీడియా మిత్రులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## కార్గో ఎయిర్‌పోర్ట్ భూసేకరణను వ్యతిరేకిస్తున్న భేతాళపురం రైతులు

**మందస, ఏప్రిల్ 9(వార్త):** మందస మండలంలోని భేతాళపురం పంచాయతీ పరిధిలోని గ్రామానికి చెందిన కార్గో ఎయిర్ పోర్ట్ భూబాధిత రైతులు, గ్రామ ప్రజలు అధికారులు, సచివాలయం సిబ్బందిని కలిశారు. వినతిపత్రాలను అందజేశారు. ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ భూమి వివరాల జాబితాకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. భేతాళపురం గ్రామంలో తహసీల్దార్ ఏర్పాటు చేసిన గ్రామ సభలో ప్రత్యేక ఉన్నత అధికారులు ఎదుట కూడా ప్రతిపాదిత జాబితా ప్రకారం భేతాళపురం గ్రామానికి చెందిన పూర్తి స్థాయిలో భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీంతో అనేక కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వస్తుందని గ్రామ ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ కార్గో ఎయిర్‌పోర్ట్ భూ సేకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బత్తిని లక్ష్మణ్, మడియా పురుషోత్తం, బత్తిని దేశయ్య, బొడ్డు శంకరరావు, బత్తిని కృష్ణారావు, గార ఆనందరావు, బత్తిని ఉమాపతి, కీలు భీమారావు, ఇరోతు దేవరాజు, మడియా జగన్నాథం, ఆడతాల కూర్మారావు, మడియా ఋషి, బత్తిని మాధవరావు, బత్తిని మహేష్, మహిళలు తదితర బాధిత రైతులు పాల్గొన్నారు.

## చిరంజీవి కుటుంబానికి ఆర్థిక సాయం



**మందస, ఏప్రిల్ 9(వార్త):** మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన సన్నాయి కళాకారుడు పిసా చిరంజీవి ఆరోగ్యం బాగు లేకపోవడంతో మరణించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరికి సొండిపూడి అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు 7వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బడియా వల్లభరావు, నగిరి కరుణాకర్, బస్కల మురళి, రంజిత్, షణ్ముఖరావు, నరేష్, గౌతమ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ విద్య



**మందస, ఏప్రిల్ 9(వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ విద్య లభిస్తుందని అధ్యాపకులు అన్నారు. మందస మండలంలోని అడ్మిషన్ల డ్రైవ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యలో ప్రవేశాలకు కొరకు వివిధ గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యార్థుల గ్రామాల్లో విద్యార్థులతో అధ్యాపక బృందం గురుగు బెల్లి రమణమూర్తి, పైడి గోవిందరాజులు, లోకనాథం సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కళాశాలలో పని చేయడం జరుగుతుందన్నారు. విద్య కొరకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన సౌకర్యం, సంకల్ప కార్యక్రమం, క్రమశిక్షణతో కూడిన విద్య విలువలు, నైపుణ్యం, వ్యక్తిత్వ వికాస మొదలైన ప్రణాళిక బద్ధమైన లక్ష్యంతో విద్యార్థులకు విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. దీంతో మంచి ఫలితాలు సాధించామని, గడిచిన విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరం 92శాతం, ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో 84శాతం ఉత్తీర్ణత సాధించుటకు ప్రతిరోజు ప్రత్యేకమైన తరగతులు నిర్వహించామన్నారు. వెనుకబడిన విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించి ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.నాగభూషణం, బురద రినీష, రవికుమార్ ప్రభుత్వ కళాశాలలో అభ్యసించిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లాలో 4వ విడత భూ రీసర్వే



**మందస, ఏప్రిల్ 9(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో 4వ విడత భూ రీసర్వే చురుకుగా సాగుతోందని సర్వే, భూముల రికార్డుల అసిస్టెంట్ డైరక్టర్ ఎం.జ్యోషిత అన్నారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాల్గవ విడత రీసర్వేపై అవగాహన కల్పించారు. సర్వే సమయంలోనే ఈకేవైసీ చేయాలని, రైతులతో సమన్వయం చేసుకుని సర్వే చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఐవీఆర్ కాల్స్ పై అవగాహన కల్పించారు. నాన్ సిగ్నల్స్ గ్రామాలలో ఎలా రీసర్వే చేయాలో తెలిపారు. పీజీఆర్ఎస్, ఎఫ్.లైవ్స్ సకాలంలో చేయాలని, బియాండ్ ఎస్ఎల్ఏకు రాకుండా చూడాలని, ఒకవేళ అలా వస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ సర్వే సీహెచ్.చంద్రశేఖర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.నారాయణరావు, మండల సర్వేయర్ బొడ్డపాటి బాబురావు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

# ప్రతి పైసా సద్వినియోగం కావాలి

- అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు
- నాణ్యతలో రాజీపడొద్దు
- 316 పనులకు గాను 150 పూర్తి..
- మిగిలినవి సత్వరమే పూర్తి చేయాలని ఆదేశం
- రూ.19.68 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష



**శ్రీకాకుళం, ఏప్రిల్ 9 (వార్త):** ప్రజల అవసరాల కోసం కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులు ప్రతి పైసా సద్వినియోగం కావాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 17, 18వ లోక్‌సభ ఎంపీ లాడ్స్ నిధుల సమీక్షలో ఆయన పాల్గొని, నిధుల వినియోగంపై శాఖల వారీగా విశ్లేషణ చేశారు. శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో మొత్తం రూ.సుమారు రూ. 19.68 కోట్ల అంచనా వ్యయంతో 316 పనులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 150 పనులు పూర్తయి తుది బిల్లుల చెల్లింపు జరిగిందని మంత్రి వెల్లడించారు. పనులు పూర్తయిన వెంటనే వాటికి సంబంధించిన ఫోటోలను 'ఈ-సాక్షి' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, అప్పుడే నిధుల విడుదల వేగవంతం అవుతుందని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలిస్తే.. పంచాయతీ రాజ్ శాఖలో రూ. 911.40 లక్షల వ్యయంతో చేపట్టిన 153 పనుల్లో ఇప్పటి వరకు 66 పనులు పూర్తయ్యాయి. విద్యుత్ శాఖ పరిధిలో రూ. 443.81 లక్షలతో మంజూరైన 76 పనులకు గాను 34 పనులు పూర్తి కాగా, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 19 పనులకు గాను 10 పనులు కొలిక్కి వచ్చాయి. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో రూ. 302 లక్షలతో చేపట్టిన 50 పనుల్లో 27 పనులు, ఇతర విభాగాల్లో మంజూరైన 18 పనుల్లో 13 పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. మొత్తం మంజూరైన నిధుల్లో ఇప్పటి వరకు రూ. 800.58 లక్షల వ్యయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ శాఖలో ఇంకా 76 పనులు, విద్యుత్ శాఖలో 42 పనులు పెండింగ్‌లో ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా టెక్కలి, శ్రీకాకుళం డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కార్యనిర్వాహక ఇంజనీర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్, డీఆర్వో విశ్వేశ్వరరావు, సీపీఓ ప్రసన్న లక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పోషణ్ పక్వాడ పోస్టర్ ఆవిష్కరణ




పోషణ్ పక్వాడ కార్యక్రమం ఈనెల 23 వరకు కొనసాగుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్ర మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రాజెక్టు స్థాయిల్లోనూ, జిల్లా స్థాయిలోను అంగన్వాడీ కేంద్రం స్థాయిలోనూ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిడి కె. రూపలత, ఎపిడిపిఓ పి. మణమ్మ, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎం మహేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

# పది స్పాట్ కేంద్రాల వద్ద ఉపాధ్యాయుల నిరసన

**శ్రీకాకుళం, ఏప్రిల్ 9 (వార్త):** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఫ్యాప్టో ఇచ్చిన పిలుపుమేరకు శ్రీకాకుళం జిల్లాలో పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల వద్ద గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. సిపిఎస్ జిపిఎస్ విధానాలు రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని యధావిధిగా కొనసాగించాలని, 2003లో నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, 12వ పిఆర్సి కమిషన్‌ని నియమించి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సరెండర్ లీవ్ డిఏ బకాయిలు తక్షణమే చెల్లించాలని, 70 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు 15 శాతం అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ అమలుచేయాలనీ. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే కారుణ్య నియామకాలు చేపట్టాలనీ, ఉమ్మడి సర్వీస్ రూల్సు సంబంధించి జిఒ నెం. 72, 73, 74 అమలుపరచాలనీ. ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలనీ, ఉపాధ్యాయుల సరెండర్ లీవ్ బకాయిలు డిఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ బి శ్రీరామ్ మూర్తి, సెక్రటరీ జనరల్ పి ప్రతాప్ కుమార్, వి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వర్లు, బి రవికుమార్, పి బాలాజీ రావు, చౌదరి రవీంద్ర, బీ ధనుంజయరావు, జి శ్రీనివాసరావు, కే జగన్మోహనరావు, కే రామశర్మ, పి తిరుమలరావు, చావలి శ్రీనివాస్, ఎంవీ రమణ, వి నవీన్ కుమార్ వై ఉమా శంకర్, చిట్టి త్రినాధరావు, బీ తాతారావు, బి రవికుమార్, జి గిరిధర్,బి ధనలక్ష్మి, ఎం.ఏసురత్నం, కె.దాలయ్య, ఎస్.రమేష్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్
- మీ భూమి-మీ హక్కు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ





**సరుబుజ్జిలి, ఏప్రిల్ 9 (వార్త):** రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి మండలం విజయరాంపురం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యకమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో రెవిన్యూ శాఖలో చాలా తప్పులు జరిగాయన్నారు. రైతులు పాస్ పుస్తకాల ముద్రణలో కూడా జగన్ బొమ్మ వేశారని, అవన్నీ సరిజేస్తూ ప్రభుత్వం రైతుల భూముల హక్కులను స్పష్టంగా నమోదు చేసి, వారికి పూర్తి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రైతులు తమ భూములపై ఎలాంటి అనుమానాలు లేకుండా హక్కులను పొందేందుకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. విజయరాంపురం గ్రామంలోని పలువురు రైతులకు స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేసి వారికి అభినందనలు తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షులు శివాల సూర్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అంబల్ల రాంబాబు,, నందివాడ గోవిందరావు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, కూటమి పార్టీ ముఖ్య నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### దళిత గృహాలకు 'సూర్యఘర్' వెలుగులు

విద్యుత్ బిల్లుల భారం నుంచి దళిత కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఎస్సీ/ఎస్టీ సూర్యఘర్ యోజన' అద్భుతమైన అవకాశమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. సరుబుజ్జిలి మండలం మర్రిపాడు, బురిడివలస గ్రామాల్లో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సూర్యఘర్ యోజన ఉత్సవ్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 14 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల ద్వారా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచిత సోలార్ పవర్ ఏర్పాటుతో పాటు, పాత విద్యుత్ బకాయిలపై ప్రత్యేక రాయితీలు, సులభ వాయిదాల పద్ధతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, విద్యుత్ శాఖ డీఈ యోగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు అంబల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## శనీశ్వర కొండ చుట్టూ ఆక్రమణలు

**పలాస, ఏప్రిల్ 9 (వార్త):** పలాసలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాశీబుగ్గ పద్మనాభపురం సమీపంలోని శనీశ్వరుడి కొండ పరిసరాల్లో ఉన్న డి-పట్టా భూములు క్రమంగా ప్రైవేటు పరమవుతున్నాయి. ఇప్పటికే ప్రశాంతి సాయి స్పిరిట్యువల్ అండ్ సర్వీస్ ట్రస్ట్ పేరిట సుమారు 20 సెంట్ల ప్రభుత్వ భూమిని వినియోగించుకుని భవనం నిర్మించి కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అదే ప్రాంతంలో మరో 12 సెంట్ల భూమి కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవడం స్థానికుల్లో అనుమానాలకు తావిస్తోంది. భూమిలేని పేదలకు సెంటు భూమి కూడా కేటాయించని అధికారులు, ట్రస్టుకు మాత్రం భూమి ఇవ్వడానికి సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్లు 253/4, 253/8 పరిధిలో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. సుమారు రూ.2 కోట్ల విలువైన భూములపై కన్నేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణ పనులు ప్రారంభించారని, స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై స్పందించిన పలాస తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యే శిరీష రికమెండేషన్ చేయడంతో 12 సెంట్లు భూమి ట్రస్టుకు కేటాయింపుపై కలెక్టర్‌కు ఫైల్ పంపిస్తున్నామని తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546